క్లుప్తంగా

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో పూజలు


బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతోపాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం


సుబ్బంపేటలో ఒక వైపునకు ఒరిగి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభం

కొత్తపల్లి: ఉప్పాడ శివారు సుబ్బంపేటలో గత కొన్ని రోజులుగా విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నీరు నిలిచిపోవడంతో విద్యుత్ స్తంభం ఒక వైపు ఒరిగిపోయింది. నిత్యం పాఠశాలకు వెళ్లే విద్యార్థులు అదే రోడ్డులో పాఠశాలకు వెళ్లి వస్తూ ఉంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు పరిమార్లు సమాచారం ఇచ్చిన ఏ ఒక్కరూ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సమయం అధికారులు స్పందించి దృష్టి పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భారీ అన్నదానం


సామర్లకోట ఆటోస్టాండ్ వద్ద అన్నదానం

సామర్లకోట: స్థానిక బసివిరెడ్డి సత్రం వద్ద ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీగణపతి ఆటో యూనియన్ వద్ద గణపతి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక పెద్దాపురం ఆటో స్టాండ్ శ్రీలక్ష్మీ గణపతి యూనియన్ అధ్యక్షుడు ఆర్.చిన్నా, ఉపాధ్యక్షుడిగా వి.అచ్చుతరామయ్య, కార్యదర్శిగా బి.బాసిబాబు, సహాయ కార్యదర్శి ఎస్కే భాషా, కోశాధికారి ఎ.శివ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు రమణ, వీరబాబు, సుబ్రహ్మణ్యం, పి.వీరబాబు, కృష్ణ, జాన్‌ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సుమారు ఆరు వేల మంది అన్నదానం స్వీకరించారని నిర్వాహకులు తెలిపారు. ఆటో యూనియన్ సభ్యులు, మదర్ థెరిసా వలంటీర్ ఆర్గనైజేషన్ అధినేత జి.రాజులు భక్తులకు సేవలందించారు. శనివారం గణేశ్ విగ్రహ నిమజ్జన కార్యక్రమం ఉంటుందని యూనియన్ అధ్యక్షుడు చిన్నా తెలిపారు. లయన్స్ క్లబ్ భవనంలో క్లబ్ అధ్యక్షుడు అమలకంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జయలక్ష్మి థియేటర్ సమీపంలో వైఎస్సార్ సీపీ మాజీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను ఆధ్వర్యంలో అన్నదాన జరిగింది.

గ్రామస్థాయిలో కమిటీల ఏర్పాటు

కొత్తపల్లి: పిఠాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి గ్రామస్థాయిలో కమిటీలను త్వరలో ఏర్పాటు చేసినట్టు ఎంపీ ఉదయ శ్రీనివాస్ అన్నారు. స్థానికంగా ఉన్న సురక్ష ప్యాలెస్‌లో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టి.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రసాద్‌కు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు


సూర్యప్రసాద్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, డీఈఓ రమేష్ తదితర ప్రజాప్రతినిధులు

కరప: వేళంగి మెర్లాస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న పట్టా సూర్యప్రసాద్ ఈ ఏడాది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు. కాకినాడ జేఎన్‌టీయుకేలో శుక్రవారం జరిగిన గురుపూజోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్, డీఈఓ పి.రమేష్, ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ తదితరుల చేతుల మీదుగా సూర్యప్రసాద్ ఈ అవార్డును అందుకున్నారు.

మూణ్ణాళ్లకే ముక్కలు

- రూ.3 కోట్లతో రహదారుల నిర్మాణం
- నాణ్యతకు తిలోదకాలు
- నెల రోజులకే పాడైపోయిన వైనం
- మరమ్మతులతో దాచి పెడుతున్న అధికారులు


నెల రోజులకే పాడైపోయిన గొల్లప్రోలు - తాటిపర్తి పుంత రోడ్డు


వాహనాలు ప్రయాణించడంతో రాళ్లు పైకి లేచిపోతున్న పుంత రోడ్డు

పిఠాపురం: నిత్యం రద్దీగా ఉండే ఆ రహదారులు ఎట్టకేలకు నిర్మాణాలకు నోచుకున్నాయన్న ఆనందం నెల రోజుల్లోనే ఆవిరైపోయింది. ఎంతో పటిష్టంగా నిర్మించాల్సిన ఆ రోడ్లు తూతూమంత్రంగా నిర్మించి చేతులు దులుపేసుకున్నారు. దీంతో వేసిన మూణ్ణాళ్లకే ముక్కలవుతున్నాయి. అభివృద్ధి మాటున అవినీతికి రహదారులుగా మారిపోయాయి. మూణ్ణాళ్లకే ముక్కలవుతున్న రోడ్డు నిర్మాణంలో జరిగిన అవినీతిని కప్పిపుచ్చేందుకు మరమ్మతులు చేస్తూ నాణ్యతాలోపాలను దాచి పెట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నా అవి యథావిధిగా పాడైపోతున్నాయి.

రూ.3 కోట్లతో రోడ్లు

గొల్లప్రోలు నగర పంచయతీని ఆనుకుని ఉన్న 216 జాతీయ రహదారి నుంచి గొల్లప్రోలు మండలం తాటిపర్తి వెళ్లే పుంత రోడ్డును ఇటీవల మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో తారు రోడ్డు నిర్మించారు. దీని నిర్మాణానికి రూ 1.47 కోట్లు వెచ్చించారు. అలాగే గొల్లప్రోలు మండలం తాటిపర్తి నుంచి పిఠాపురం మండలం పి.రాయవరం వెళ్లే పుంత రోడ్డును రూ 1.47 కోట్లు వెచ్చించి బీటీ రోడ్డు నిర్మించారు. ఒక్కో రోడ్డును మూడు విభాగాలుగా విడదీసి ఒక్కో విభాగం రూ.49 లోల చొప్పున ఖర్చు చేసినట్లు చూపించారు. ఈపనిలో ఉపాధి కూలీలకు పని చెప్పినట్టుగా రికార్డుల్లో చూపించిన అధికారులు మెటీరియల్‌కు రూ.48.72 లక్షలు ఖర్చు చూపించారు. అయితే ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేసి వేసిన ఈ రోడ్లు నెల రోజుల ముందే ముక్కలవుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పలు చోట్ల రోడ్డు మార్జిన్లు వద్ద పగుళ్లు ఏర్పడి రోడ్డు ముక్కలుగా విడిపోతోంది. ఇలా విడిపోయిన రోడ్డు వద్ద ముక్కలవుతున్న రోడ్డు కనిపించకుండా అధికారులు గ్రావెల్‌ను వేసి కప్పిపుచ్చుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

నాణ్యతకు తిలోదకాలు

వ్యవసాయ పనులకు అత్యంత ప్రాముఖ్యత ఉన్న ఈ రోడ్లు చాలా పటిష్టంగా నిర్మించాల్సి ఉంది.


మూణ్ణాళ్లకే ముక్కలైన రోడ్డుపై మరమ్మతులు చేసినా మళ్లీ మామూలే

నిత్యం రైతులు తమ తమ పొలాలకు వ్యవసాయ పనిముట్లు పశువులు, ట్రాక్టర్లు, ఎడ్ల బళ్లను ఈ రోడ్లు మీదనే తీసుకెళుతుంటారు. అలాంటి రోడ్డును ముందుగా పటిష్ట పరిచి దానిపై తారు రోడ్డు వేయాల్సి ఉండగా పాత రోడ్డుపై ఎక్కడా ఎటువంటి ముందు చర్యలు తీసుకోకుండా నేరుగా తారు రోడ్డు వేసేశారు. దీంతో రోడ్డు నెల రోజులు తిరగక ముందే ఎక్కడికక్కడ ముక్కలుగా విడిపోతోందని రైతులు ఆరోపిస్తున్నారు. వేసిన రోడ్డు సైతం మందంగా కాకుండా పల్చగా వేయడంతో వర్షం వస్తే చాలు పాడైపోతుంది. ఈ స్పష్టంగా కనిపిస్తోందని రైతులు విమర్శిస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేసినప్పుడు చాలా పటిష్టంగా నిర్మించాల్సిన రోడ్డును ఇంత దారుణంగా నాణ్యత లేకుండా నిర్మించడంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై వివరణ కోరేందుకు పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీర్లను సంప్రదించగా అందుబాటులో లేరు.

> **విచారణ జరిపించాల్సిందే..**
>
> 216 జాతీయ రహదారి నుంచి గొల్లప్రోలు మండలం తాటిపర్తి వెళ్లే పుంత రోడ్డు నిర్మాణం నాణ్యత లేకుండా వేశారు. దానిపై విచారణ జరిపించాలి. వాణిజ్య పంటల భూములు ఉండే ఆ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం పటిష్టంగా ఉండాలి. కాని కాలితో గీసినా రోడ్డు ఊడిపోతోంది. తారు కూడా ఎంతో వాడలేదు. రోడ్డు కొద్ది రోజుల్లోనే పాడైపోయింది. ఇంత దారుణంగా రోడ్డు వేయడం ఇప్పటి వరకు చూడలేదు. దీనిపై విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి. రోడ్డు నిర్మాణంలో నాణ్యత లేకుండా నిర్మించడంతోపాటు దానిని కప్పి పుచ్చుకోడానికి గుంతలు పడిన చోట్ల మరమ్మతులు చేసి ఏమి జరగనట్టుగా అధికారులు చేయడం మరీ దారుణం. ఈ రోడ్డు నిర్మాణంపై పూర్తి స్థాయిలో విచారణ చేయించి ఇటువంటి నాణ్యత లేని పనులు పునరావృతం కాకుండా చూడాలి.
>
> –ఉలవకాయల నాగ లోవరాజు, జెడ్పీటీసీ, గొల్లప్రోలు

ఘనంగా గురుపూజోత్సవం


శాంతివర్ధనలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న వీరబాబు దంపతులు


సామర్లకోటలో ఉపాధ్యాయులను సత్కరించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు తదితరులు


విశ్రాంతి ఉపాధ్యాయుడు చలపతిరావును సత్కరిస్తున్న దృశ్యం

పెద్దాపురం: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ ప్రకాష్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో మండల విద్యాశాఖాధికారులు ప్రభాకర శర్మ, చౌదరి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులకు గుర్తింపు తెచ్చిన రాష్ట్రపతిగా ఎదిగిన సర్వేపల్లిని ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం రాధాకృష్ణ జన్మదిన కేక్‌ను ఆయన కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో శుక్రవారం గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాయవరపు సత్య అధ్యక్షతన జరిగిన వేడుకలో ప్రముఖ పీఎంపీ వైద్యులు చిర్రావూరి గంగారావు (డాక్టర్ దత్తుడు), పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబులు తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయ, అధ్యాపక సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఏఓ వేణు, బాబి, చంటి, అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు. పెద్దాపురం శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో రాజమహేంద్రవరం, పెద్దాపురం, కాకినాడ బ్రాంచిలకు చెందిన ఉపాధ్యాయులందరూ రాధకృష్ణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, అధ్యాపక బందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

సామర్లకోట: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది వారేనని లయన్స్ క్లబ్ జిల్లా ఉప గవర్నర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఈఓ ప్రత్తి రామలక్ష్మణమూర్తి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డి.వీరన్నతో పాటు ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టరు అమలకంటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, కైట్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నున్నా గోపి, లయన్స్ జిల్లా చైర్మన్ మేకా శ్రీనివాసరావు, గవర్నర్ రిప్రజంటేటివ్ చిత్తూలూరి వీర్రాజు, మాజీ అధ్యక్షులు భాస్కరరెడ్డి, గుండు శంకరరావు, మాజేటి కృష్ణ, క్లబ్ కోశాధికారి ఏలేటి రమేష్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ, టి.సునీత, న్యాయవాది కొర్లమండ వీరభద్రరావు పాల్గొన్ని ఉపాధ్యాయులు పెదపాటి వెంకన్న, దేవగుప్తపు సుబ్బారావు, యరమాటి సూర్య, పడిమ మంగాదేవి, బట్టరు వెంకట్రావులను సత్కరించారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం

కొత్తపల్లి: మండలంలోని పలువురు విశ్రాంత ఉపాధ్యాయులను మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు పంపన శేష ఆధ్వర్యంలో శుక్రవారం సాలువ, పూలమాలతో సత్కరించారు. మండలంలోని కుతుకుమిల్లి గ్రామానికి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయులు మచ్చిగంటి వెంకట చలపతి రావు, పడగ నరసింహారావును వారి స్వగృహంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమణం సుబ్రహ్మణ్యం, సిద్ధి రామ్మోహన్ రావు, కడియాల రామానుజన్, వరలక్ష్మి నారాయణ, గౌరీ శంకర్, డీవీఎస్ రాజు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అప్పలరాజుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు


అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు అప్పలరాజు

కొత్తపల్లి: తాను చదువుకున్న పాఠశాలలోనే ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా గౌరవం పొందడం అదృష్టమని ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎల్‌వీఎన్ శాస్త్రి కొనియాడారు. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దాకే అప్పలరాజు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కాకినాడలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో 28 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా సేవలు అందించడం ఆనందంగా ఉందన్నారు. ఆయనకు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

అలరించిన దీపాలంకరణ


సామర్లకోట మఠంసెంటర్‌లోని గణపతి శిబిరంలో దీపాలంకరణ

సామర్లకోట: స్థానిక మఠంసెంటర్‌లో ఏర్పాటు చేసిన గణపతి శిభిరం వద్ద శుక్రవారం రాత్రి దీపాలంకరణ చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపును పురస్కరించుకొని శిబిరం నిర్వాహకులు దీపాలంకరణ ఏర్పాటు చేశారు. మహిళలు పిల్లలు దీపాలను వెలిగించారు. గణపతి, జ్యోతిర్లింగం ఆకారంలో దీపాలను ఏర్పాటు చేశారు. దీపాలంకరణను తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

నేడు వాహనాల దారి మళ్లింపు

కొత్తపల్లి: ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్‌లో శనివారం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా దారి మళ్లిస్తున్నట్టు ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఉప్పాడ తీరప్రాంతంలో వినాయక విగ్రహాల నిమజ్జనాల కారణంగా ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా వాహనాల దారి మళ్లిస్తున్నట్టు తెలిపారు. వాహనదారులు గమనించి ప్రత్యామ్నాయ మార్గాలైన ఉప్పాడ-పండూరు, ఉప్పాడ-పిఠాపురం మార్గాల ద్వారా వెళుతూ సహకరించాలని కోరారు. ముఖ్యంగా బీచ్ రోడ్‌లో వినాయక నిమజ్జనానికి సంబంధించి వాహనాల తప్ప ఏ వాహనాలు బీచ్ రోడ్‌లో వెళ్లేందుకు అనుమతి లేదన్నారు.

ఆరోగ్యశ్రీపై కూటమి కుట్ర

కాకినాడ రూరల్: ఆరోగ్య పేరు చెబితే ముందుగా గుర్తుకు వచ్చేది పేదల పెన్నిధి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆయన అమలు చేసిన ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎన్నో పేద కుటుంబాలు కార్పొరేట్ వైద్యాన్ని పొందాయి. అటువంటి ఆరోగ్య పథకాన్ని నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి ఆరోపించారు. కాకినాడ కొత్త గైగోలుపాడు నివాసంలో శుక్రవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వైద్యం ప్రైవేట్ బీమా(ఇన్సూరెన్స్) కంపెనీలకు అప్పగించేందుకు ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడం ద్వారా కోట్ల రూపాయలు కొల్లగొట్టాలని చూడడం బాధకరమని, పర్సంటేజీల కోసం నిర్వీర్యం చేయాలని చేస్తూ పేదల ఆరోగ్యానికి రక్షణ కరవవుతుందన్నారు. ఇన్సూరెన్స్ ద్వారా అయితే ప్రజల ఆరోగ్యానికి భరోసా ఉండదని, అదే ట్రస్ట్ ద్వారా అయితే కచ్చితమైన భరోసా ఉంటుందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇన్సూరెన్స్ హైబ్రిడ్ మోడల్ ద్వారా అనగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.5లక్షల వరకు ఇన్సూరెన్స్ పద్ధతిలో రూ.25 లక్షల వరకు ట్రస్ట్ ద్వారా చెల్లిస్తారని, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ట్రస్ట్ మోడల్ ద్వారా కరోనా సమయంలో 3,257 జబ్బులకు రూ.25 లక్షల వరకు పెంచి వైద్యం అందించారని తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీలు సేవలు చేయడానికి రావని, ప్రభుత్వం పునరాలోచన చేసి ఆరోగ్య శ్రీ పథకం ద్వారానే ప్రజలకు మెరుగైన సేవలందించాలని కోరారు.

మిలాద్-ఉన్-నబీ ర్యాలీ


సామర్లకోటలో ముస్లింల ర్యాలీ

సామర్లకోట: ఇస్లాం పరంపర ఆదమ్ ప్రవక్తతో ప్రారంభమైందని ముస్లిమ్‌లు భావిస్తూ ఆయన జయంతి ఘనంగా జరుపుకొంటారు. దీనిలో భాగంగా శుక్రవారం మిలాద్-ఉన్-నబీ వేడుకల సందర్భంగా పెద్దాపురం నుంచి సామర్లకోట పట్టణ పురవీధుల గుండా భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మహ్మద్ ప్రవక్తను ఇస్లామ్ మత స్థాపకుడిగా కొలుస్తామని ముస్లిం నాయకులు తెలిపారు. కీ.శ 570లో ప్రవక్త మక్కాలో జన్మించారని, చిన్నతనంలోనే అనాధ అయిన ప్రవక్త మేనమామ అబూ తాలిబ్ సంరక్షణలో పెరిగారని ముస్లిం సంఘ నాయకులు చెప్పారు. ఇస్లామ్ మత బోధన చేస్తూ మక్కా నుంచి మదీనాకు వెళ్లి 632లో మదీనాలోనే మరణించారన్నారు. ఈ మేరకు ప్రతి ఏడాది ఆయన జయంతిని ఘనంగా జరుపుకొంటున్నామని ముస్లిం నాయకులు తెలిపారు.

తరచూ లీకేజీలు

- నాసిరకంగా పైపులైన్‌తో ఇబ్బంది
- చెరువులుగా మారుతున్న రహదారులు
- మున్సిపాలిటీలో ఇదీ పరిస్థితి


సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో లీకవుతున్న పెద్దాపురం తాగునీటి పైపులైన్

సామర్లకోట: పెద్దాపురం మున్సిపాలిటీకి చెందిన తాగునీటి ప్రధాన పైపులైన్ సామర్లకోట బ్రౌన్‌పేట నుంచి ప్రసన్నాంజనేయస్వామి ఆలయం నుంచి పెద్దాపురానికి వెళుతుంది. ఈ పైపులైన్ తరచూ లీకులకు గురవుతోంది. దాంతో సుమారు నెల రోజుల క్రితం సామర్లకోట-పెద్దాపురం రోడ్డులోని సుధా ఫ్యాక్టరీ సమీపంలో పైపులైన్ మరమ్మతు పనులు చేశారు. ఆ సమయంలో ఆ రోడ్డు మీదుగా సుమారు వారం రోజుల పాటు రాక పోకలు కూడా నిలిపివేశారు. అయితే పైపులైన్ మరమ్మతులు పూర్తి చేసిన నెల రోజులకే పైపులైన్ లీకు కారణంగా రోడ్డుపై చెరువుగా మారిపోయింది. దీనికి పెద్దాపురం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే కారణమనే వాదనలు వినిపిస్తున్నాయి. సామర్లకోట-కాకినాడ రోడ్డులో ఉన్న సాంబమూర్తి రిజర్వాయర్ నుంచి వాటర్ టాంకులను పైపులైన్ ద్వారా నీరు సరఫరా అయ్యే సమయంలో నీరు లీకవుతోంది. పంపింగ్ నిలిచిపోయిన తరువాత పైపులైన్ లీకులు కారణంగా ఆ ప్రాంతంలో రోడ్డు పై ఉన్న వ్యర్థ పదార్థాలు, చెత్త లీకుల గుండా పైపులైన్‌లోనికి ప్రవేశించే అవకాశం ఉన్నదని స్థానికులు వాపోతున్నారు. దాంతో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా తగు శ్రద్ధ తీసుకొని పైపులైన్ లీకులు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

మలుపుల్లో ముప్పు

- నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు, ఫ్లెక్సీ బోర్డులు
- ట్రాఫిక్‌కు అంతరాయం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు
- పట్టించుకోని అధికారులు


గాంధీనగర్ రైతుబజార్ రోడ్డు టర్నింగ్‌లో ఉన్న ఫ్లెక్సీ బోర్డులు,వ్యాపారాలు

కాకినాడలీగల్: కాకినాడను ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. మలుపులు వద్ద మరింత దారుణంగా మారింది. స్మార్ట్‌సిటీగా ఉన్నా నగరంలో ట్రాఫిక్ సమస్యను మాత్రం ఎవరూ పట్టించుకోవడంలేదు. దీంతో వాహనచోదకులు, నగరవాసులు ఇబ్బందులకు గురికాక తప్పడం లేదు. నగరంలోని పలు ప్రధాన మలుపుల్లో వివిధ వ్యాపారాలతోపాటు ఫ్లెక్సీ బోర్డులు, విరిగిన శ్లాబ్ రాయిలు ఉన్నాయి. దీంతో ఆ ప్రాంతాలకు వెళ్లినప్పుడు టర్నింగ్ పాయింట్‌లో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురువుతున్నారు. కాకినాడ కొండయ్యపాలెం వంతెన వద్ద టర్నింగ్ పాయింట్‌లో బళ్లపై బొప్పాయి వ్యాపారం నిర్వహిస్తున్నారు. గాంధీనగర్ రైతుబజార్ రోడు టర్నింగ్‌లో వ్యాపారాలు పాటు ఫ్లెక్సీ బోర్డులు ఉన్నాయి. రామారావుపేట సుబ్బయ్య హోటల్ టర్నింగ్ విగిరిన శ్లాబ్ రాయితో, మూడు లైట్లు జంక్షన్‌లో టర్నింగ్ పాయింట్‌లో వాహనాలతో, ఇంద్రపాలెం బ్రిడ్జి టర్నింగ్ పాయింట్‌లో, సీబీఎం స్కూల్ టర్నింగ్ పాయింట్‌లో, బాలా చెరుపు సెంటర్ టర్నింగ్‌లో, రెడ్ క్రాస్ వీధి టర్నింగ్‌లో అనేక ప్రాంతాల్లో బళ్లపై వ్యాపారాలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో బోర్డులు, వ్యాపారాలు తొలగించి ప్రమాదాలను జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికుల కోరుతున్నారు.

> **చర్యలు తీసుకోవాలి**
>
> 
>
> ప్రధాన రహదారుల మలుపుల్లో ఏర్పాటు చేసే వ్యాపారాలతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ రద్దీగా ఉండే సమయాల్లో టర్నింగ్‌లో ఉండే వ్యాపారుల వద్ద బైక్‌లు ఆపి కొనుగోలు చేస్తుండడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఆ సమయంలో రోడ్డుపై వెళ్లే వాహనచోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. అలాగే టర్నింగ్లో ఉండే ఫ్లెక్సీ బోర్డులు, విరిగిన శ్లాబ్ రాయిలు తొలిగించి తగు చర్యలు అధికారులు తీసుకోవాలి.
>
> – ఎస్వీ వెంకటరమణ, స్థానికుడు